సాక్షి పెద్దపల్లి

గురువారం । 18 । మే । 2023



శరణు.. శరణు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లన్న దర్శనానికి బుధవారం భారీగా భక్తులు తరలివచ్చారు. బోనం మొక్కులు చెల్లించుకోవడంతోపాటు పట్నాలు వేశారు.



జీడీకే–11గని తనిఖీ

గోదావరిఖని(రామగుండం): రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిని ఎలక్ట్రికల్ డీడీఎంఎస్ దిలీప్‌కుమార్ బుధవారం సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
44.6/27.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజీ మార్గమే ఉత్తమం



సమావేశం నిర్వహిస్తున్న జడ్జి శ్రీనివాస్‌రావు

గోదావరిఖనిటౌన్: ఏళ్ల తరబడి కాలయాపన చేయకుండా ఇరువర్గాలు రాజీమార్గం ఎంచుకోవడం ఉత్తమమని గోదావరిఖని అదనపు జిల్లా జడ్జి టి.శ్రీనివాస్‌రావు సూచించారు. గోదావరిఖని ఆరో అదనపు జిల్లా న్యాయస్థానంలో బుధవారం నిర్వహించిన మోటార్ వాహనాల బీమా కేసులపై బీమా ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం జడ్జి మాట్లాడుతు ఇరువర్గాలు సమస్యలపై చర్చించి రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దాదాపు ఐదు కేసుల్లో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకున్నారు. జూన్ 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనుల వద్ద టెంట్లు



ఉపాధి కూలీలకు టెంట్లు వేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్ మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు నీడ సౌకర్యంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. 'సాక్షి'లో 'ఉపాధి'కి నీడేది శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కమాన్‌పూర్ ఎంపీడీవో విజయ్‌కుమార్ ఉపాధిహామీ పనిస్థలాల వద్దకు వెళ్లి టార్పాలిన్ పరదాలతో టెంట్లు వేయించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమచికిత్స కిట్లను ఫీల్డ్ అసిస్టెంట్లకు అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: బెస్ట్ అవేలబుల్ స్కూల్‌లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థులు జూన్ 2లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లాకు 15 సీట్లను కేటాయించారని పేర్కొన్నారు. విద్యార్థుల వార్షికాదాయం అర్బన్ ప్రాంతంలో రూ.2లక్షలు, రూరల్ ప్రాంతానికి చెందిన వారైతే రూ.1.50 లక్షల ఆదాయం ఉండాలని పేర్కొన్నారు. ఆదాయం, కులం, పుట్టినతేదీ, స్టడీస ర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు 2 జతచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని ఏవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూన్ 7న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 79950 70703లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఐటీఐలో మొదటి దశ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

రామగుండం: రామగుండంలోని ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)లో 2023–24 విద్యా సంవత్సరానికి ఎన్‌సీవీటీ ప్యాటర్న్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఈసారపు సురేందర్ తెలిపారు. మొదటి విడత సీట్ల భర్తీలో భాగంగా 17 నుంచి జూన్ 10 వరకు అర్హులైన అభ్యర్థులు http://iti.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైలుపట్టాలకు మరమ్మతులు



ఓదెల రైల్వేస్టేషన్‌లో రైలుపట్టాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): ఎండాకాలంలో రైలుపట్టాలు సంకోచవ్యాకోచాలు చెంది రైలు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్య మరమ్మతులు చేస్తున్నారు. కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఉప్పల్, జమ్మికుంట, ఓదెల, పొత్కపల్లి, కొలనూర్, పెద్దపల్లి, రాఘవపూర్ రైల్వేస్టేషన్ల సమీపంలో సిబ్బంది రైలుపట్టాలకు మరమ్మతులు చేస్తున్నారు. రైలుపట్టాల పటిష్టతకు రైల్వేశాఖ మరమ్మతుల కోసం శ్రీకారం చుట్టింది. రైలుపట్టాల నాణ్యత తగ్గిన చాలా రోజులు గడిచినా వాటిని తొలగిస్తూ కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. మరమ్మతు పనులు కొనసాగుతుండడంతో సికింద్రాబాద్, కాజీపేట్ నుంచి బల్లార్షా, సిర్‌పూర్‌కాగజ్‌నగర్ మధ్య భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, సిర్‌పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సింగరేణి రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

భానుడి భగభగ

- జిల్లాలో 45 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వడగాలులు
- జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాలకే ముప్పు
- సాధ్యమైనంత వరకు ఇంట్లోనే ఉండాలంటున్న వైద్యులు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. ఒక వైపు సింగరేణి గనులు.. మరోవైపు గోదావరితీరం వెరసి వడగాలులు జిల్లా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సింగరేణి బొగ్గు బావుల ప్రభావంతో జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలపైనే నమోదవుతుండడంతో వాతావరణశాఖ జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది. ఉదయం 8 గంటల నుంచే ఎండలకు భయపడి జనాలు బయటకు రావడం లేదు. రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. తీవ్ర ఎండలకు వడదెబ్బతోపాటు దీర్ఘకాలిక జబ్బులు బీపీ, షుగర్ పెరిగి.. గుండెజబ్బులు, పక్షవాతం, మూత్రపిండాల్లో రాళ్ల సమస్యలు, కడుపునొప్పితోపాటు చర్మవ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయి. చిన్నారుల్లో ఎక్కువగా జ్వరం, తలనొప్పి వాంతులు, విరేచనాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పశువులు సైతం పెరిగిన వేడితో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 45 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వాహనాలలో మంటలు రేగి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన సూచనలు వైద్యుల మాటల్లో...



నిర్మానుష్యంగా కూనారం చౌరస్తా



పెద్దపల్లిలో ఎండ నుంచి రక్షణకు ఇలా...

వడదెబ్బ ప్రభావాన్ని గుర్తించండి ఇలా..

- చెమటలు పట్టడం
- శరీరం పొడిబారడం, ఎర్రగా మారడం
- తలనొప్పి, దురద
- వాంతులు, స్పృహ కోల్పోవడం

నోరు తడి ఆరనీయొద్దు



- అశోక్, హెచ్‌వోడీ జనరల్ మెడిసిన్, జీజీహెచ్ గోదావరిఖని
- మధ్యాహ్నం ఎండలో బయటకు వెళ్లకపోవడం మంచిది. తప్పనిసరి అయితే తేలికపాటి తెల్లని వస్త్రాలు, తలకు టోపీ ధరించాలి.
- నూనె పదార్థాలు, మాంసాహారం తీసుకోవద్దు.
- ఒంట్లో నీరు 70 శాతానికి తగ్గకుండా చూసుకోవాలి. రోజుకు 5 లీటర్ల నీళ్లు తాగాలి.
- నోరు తడి ఆరకుండా నీరు, ఓఆర్ఎస్, పండ్లు రసాలు తాగాలి.
- అలసట, నీరసం అనిపిస్తే శరీరాన్ని చల్లనివస్త్రంతో తుడవాలి.
- డీహైడ్రేషన్ లక్షణాలు ఉంటే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి.

నీడపట్టున ఉండాలి



- అరుణ, హెచ్‌వోడీ, గైనకాలజిస్ట్, జీజీహెచ్ గోదావరిఖని
- ప్రెగ్నెన్సీలో బాడీ టెంపరేచర్ సాధారణం కంటే ఎక్కువ ఉంటుంది. మిగతా వారి కంటే ఎక్కువ నీళ్లు తాగాలి. నీళ్లు మరీ చల్లగా, వేడిగా ఉండకూడదు.
- గర్భిణులకు ఒంట్లో నీటిశాతం తగ్గితే ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది ప్రీమెచ్యూర్ డెలివరీకి దారితీసే ప్రమాదం ఉంది.
- పాలిచ్చే తల్లులు డీహైడ్రేషన్‌కి గురైతే పాలు తగ్గుతాయి.
- ప్రెగ్నెన్సీలో హార్మోనల్ ఇంబాలెన్స్‌తో అజీర్తి సమస్యలు వస్తాయి. దీనికి డీహైడ్రేషన్ కూడా తోడైతే జీర్ణాశయ సమస్యలు మరింత పెరుగుతాయి.
- మొలల సమస్య వెంటాడుతుంది. దీని వల్ల హిమోగ్లోబిన్ తగ్గుతుంది.
- నీటిశాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, దానిమ్మ, ద్రాక్ష, ఆరెంజ్, కీరా ఎక్కువ తినాలి. ఓఆర్ఎస్, కొబ్బరిబోండం, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి
- ఈ టైంలో కారం, మసాలాలు ఎంత త క్కువ తీసుకుంటే అంత మంచిది. నిల్వ ప చ్చళ్లు కాకుండా అప్పుడే చేసిన తాజా పచ్చళ్లు తినాలి.

నీడలో నిలపాలి




- గుండు ప్రసాద్, బైక్ మెకానిక్
- ఎలాంటి వాహనాలైన నీడలో నిలపాలి. ఎండకు ఉంచితే పెట్రోల్ ఆవిరికావడం, లీకేజీలతో మంటలు చెలరేగుతాయి.
- బైక్‌పై 40 కిలోమీటర్లు, కారు, ఇతర వాహనాలైతే 100 కిలోమీటర్లకు ఒకసారి నిలిపి వెళ్లడం మంచిది. నిలిపిన వెంటనే పెట్రోల్ సరఫరా కాకుండా చూసుకోవాలి.
- రన్నింగ్‌లో కాకుండా ఆగి ఉన్నప్పుడు ఇంజిన్ ఆపి వేయటం ఉత్తమం.
- అరిగన టైర్లు ఉంటే ఎండతీవ్రతకు పేలిపోయే అవకాశం ఉంటుంది. పాతటైర్ల బదులు కొత్తటైర్లు బిగించుకోవాలి.

రోజుకు మూడుసార్లు కడగాలి



- రవీందర్‌రెడ్డి, ఏడీ పశుసంవర్ధకశాఖ
- పాకలో సామర్థ్యానికి మించి పశువులు ఉండడం, నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు వడదెబ్బకు గురవుతాయి.
- నీడ ప్రాంతంలోకి మార్చి వీలైతే ఫ్యాన్లు లేదా కూలర్ల సాయంతో చల్లని గాలిని అందించాలి.
- వేసవిలో పశువులను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మేతకు బయటకు వదలకూడదు.
- రోజుకు మూడు నుంచి నాలుగు సార్లు చల్లని నీటితో కడగాలి. చెరువులు, గుంతలున్న చోట నీళ్లలోకి వదలాలి. కొట్టాలను బాగా ఎత్తులో నిర్మించుకుని ఎండుగడ్డితో కప్పాలి.
- తాగే నీటిని రెండు, మూడుగంటలకోసారి మార్చాలి
- పౌల్ట్రీఫాం యజమానులు షెడ్లపై గడ్డిని కప్పి, చుట్టూ జనుము సంచులు అమర్చి స్ప్రింక్లర్లతో నీళ్లు చల్లి వాతావరణాన్ని చల్లబరచాలి.



చెట్ల నీడను ఆశ్రయించిన పశువులు

తాగునీరందించడంలో సింగరేణి విఫలం

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని(రామగుండం): కార్మికుల కష్టంతో వేల కోట్ల లాభాలు ఆర్జిస్తున్న సింగరేణి సంస్థ కార్మిక కుటుంబాలకు తాగు నీరందించడంలో విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో బుధవారం నిర్వహించిన సభలో కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్రలో భాగంగా మొదటిషిఫ్ట్, నైట్‌షిఫ్ట్ డ్యూటీ కార్మికులను కలిసి మాట్లాడారు. ప్రకృతికి విరుద్ధంగా, సరిహద్దుల్లో సైనికుల్లా పనిచేస్తున్న సింగరేణి కార్మికులకు ఇన్‌కంటాక్స్ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటుపరం చేస్తే కార్మికులు ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని కోరారు. సింగరేణిలో గుర్తింపు సంఘం కేవలం పైరవీలకే పరిమితమైందని విమర్శించారు. ఎమ్మెల్యే గుర్తింపు యూనియన్‌కు వత్తాసు పలుకుతూ, కార్మికుల హక్కులను యాజమాన్యానికి తాకట్టు పెడుతున్నారన్నా రు. మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించి రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. మారెల్లి రాజిరెడ్డి, మాదరబోయిన రవికుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తఫా, సంపత్‌రెడ్డి, తాళ్లపెల్లి యుగేందర్, సిగిరి లింగమూర్తి, తిప్పారపు శ్రీనివాస్, సింహాచలం, దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మార్క రాజు, ధూళికట్ట సతీష్, శ్రీనివాస్, సారయ్య,శివ, శంకర్, అశ్రఫ్, అరుణ్ పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

జ్యోతినగర్(రామగుండం): జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియంహాలులో సమావేశం జరుగుతుందని తెలిపారు.

21న ఫౌండేషన్ కోర్సు ప్రవేశపరీక్ష

పెద్దపల్లిరూరల్: ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ తెలిపారు. ఈనెల 21న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

సక్సెస్ మన చేతుల్లోనే..

- అమ్మానాన్నలు గర్వపడేలా ఎదగాలి
- కలెక్టర్ సంగీత



కలెక్టర్ సంగీతకు జ్ఞాపిక అందిస్తున్న ఈడీ సునీల్‌కుమార్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

జ్యోతినగర్(రామగుండం): సక్సెస్ కావాలంటే మన చేతుల్లోనే ఉందని, అమ్మానాన్నలు గర్వపడేలా ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు బాలికా సాధికారత శిక్షణలో రాణించాలని కలెక్టర్ డాక్టర్ సంగీత సూచించారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో సీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సాధికారత మిషన్–2023 శిక్షణ శిబిరానికి బుధవారం హాజరయ్యారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. జీవితంలో మనకు వచ్చే ప్రతి అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 120 మంది బాలికలకు అదనపు నైపుణ్యాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. గతంలో మైనింగ్ ఇంజినీరింగ్ వంటి కోర్సులను అబ్బాయిలు మాత్రమే ఎంచుకునేవారని, ప్రస్తుత సంవత్సరం 12 మంది అమ్మాయిలు మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సును ఎంపిక చేసుకున్నారని గుర్తు చేశారు. బాలికలు తమకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేలా శిక్షణను పూర్తి చేసుకోవాలన్నా రు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు అన్ని రంగాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 120 మంది విద్యార్థినులకు నాలుగు వారాలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(ఉద్యోగ గుర్తింపు సంఘం) నాయకులు వెంకటస్వామి, కందుల స్వామి, సమ్మిరెడ్డి, రమేశ్, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓసీపీ–3లో తప్పిన భారీ ప్రమాదం



దగ్ధమైన డీజిల్ బోజర్

- బ్యాటరీలు పేలి డీజిల్ బోజర్ దగ్ధం

గోదావరిఖని(రామగుండం): రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. డంపర్లలో డీజిల్ నింపేందుకు వినియోగించే డీజిల్ బోజర్(భారీ డీజిల్ ట్యాంకర్)లోని బ్యాటరీలు పేలి అగ్నిప్రమాదానికి గురైంది. బ్యాటరీ నుంచి లేచిన మంటలు క్యాబిన్‌కు అంటుకుని దగ్ధమైంది. ట్యాంకర్‌కు సంబంధించిన టైర్లు పూర్తిగా కాలిపోయాయి. విపరీతమైన ఎండవేడికి బ్యాటరీలు పేలి ప్రమాదం జరిగినట్లుగా చెబుతున్నారు. అయితే సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకుంటే డీజిల్ ట్యాంకర్‌కు మంటలు అంటుకుంటే పెద్ద ప్ర మాదం జరిగేదని అంటున్నారు. ఈ విషయంలో తాము ఎన్నిసార్లు చెప్పినా లెక్కచేయకుండా ఎండలో పనులు చేయించడంతో డీజిల్ బోజర్ ప్రమాదానికి గురైందని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఓసీపీల్లో పనివేళలు మార్చాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఆదరువు

- పీఎంశ్రీకి 11 స్కూల్స్ ఎంపిక
- ఐదేళ్లపాటు నిధుల కేటాయింపు
- ఏటా రూ.40 లక్షలు
- దరిచేరనున్న సౌకర్యాలు

సుల్తానాబాద్‌రూరల్:ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఐదేళ్లపాటు ఏటా రూ.40 లక్షలు కేటాయిస్తారు. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడంతోపాటు విద్యావ్యవస్థలో సమూల మార్పులు చోటుచేసుకోనున్నాయి.

విద్యలో మార్పులు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పీఎం ఎస్‌హెచ్‌ఆర్ఐ(పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో కేంద్ర, రాష్ట్రాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాఠశాలలను ఎంపిక చేసి నిధులు కేటాయిస్తారు. ఎంపికై న పాఠశాలలను అభివృద్ధి చేయడం, గుణాత్మక బోధన, అభిజ్ఞా వికాసం, 21వ శతాబ్దపు కీలక నైపుణ్యాలను కలిగి ఉన్న నిపుణులైన పౌరులను దేశానికి అందించడం ఈ పథకం ఉద్దేశ్యం. పెద్దపల్లి జిల్లాలో 11 పాఠశాలల్లో ఒకటి ప్రైమరీ, ఐదు జెడ్పీ స్కూల్స్, రెండు రెసిడెన్షియల్ స్కూల్స్, 3 గురుకుల స్కూల్స్ ఎంపికయ్యాయి.

పాఠశాలలో అభివృద్ధి చేసే అంశాలు

జాతీయ విద్యావిధానానికి ఎన్ఈపీకి అనుగుణంగా విభిన్న నేపథ్యం, బహుభాషా, విభిన్న విద్యా సామర్థ్యాలు అభివృద్ధి చేసేందుకు ల్యాబ్‌లు,



ఎంపికైన గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

స్మార్ట్ క్లాసురూమ్స్, లైబ్రరీలు, స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, ఆర్ట్ రూమ్‌లతోపాటు ఆధునిక సదుపాయాలు కల్పించనున్నారు.

నిధుల కేటాయింపు ఇలా..

పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్రం వాటా 60 శాతం కాగా రాష్ట్రం వాటా 40 శాతంతో ఏటా రూ.40లక్షలు కేటాయిస్తారు. ప్రతీ విద్యార్థిపై ఏటా దాదాపు రూ.75వేలు వెచ్చిస్తున్నారు. మిగతా నిధులు సంవత్సరానికి లైబ్రరీ గ్రాంటు కింద రూ.5వేలు, స్పోర్ట్స్‌కు రూ.50వేలు, యోగాకు రూ.లక్ష, మెటీరియల్ కోసం(బుక్స్)కు దాదాపు రూ.2లక్షలు, అడిషనల్ గ్రాంట్ రూ, 2లక్షలు, టీచింగ్ మెటీరియల్‌కు రూ.25వేలు, సమగ్ర వివరణ తెలియజేసే పరికాల కోసం రూ.15వేలతో తెలిసిన సమచారం మేరకు ఈ నిధులు కేటాయించగా మిగతా అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తారు.

జిల్లాలో 11 పాఠశాలు ఎంపిక

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, రామగుండంలలోని మోడల్‌స్కూల్స్, మంథని, ధర్మారంలో గురుకులాలు, పెద్దపల్లి, మంథని, కమాన్‌పూర్, ఓదెల, రామగుండంలోని జెడ్పీ హైస్కూల్స్ ఎంపికయ్యాయి.

ఆదర్శ పాఠశాలలుగా మారుతాయి



ఎంపీ ఎస్‌హెచ్‌ఆర్ఐ, మన ఊరు– మన బడి కింద వచ్చే నిధులతో ఆదర్శ పాఠశాలుగా మారుతాయి. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ సౌకర్యాలు దరిచేరుతాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతుంది.

– వీరగోని సుజాత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు, సుల్తానాబాద్

విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట



జాతీయ విద్యావిధానంతో పాటు అన్నిరకాల వసతుల కల్పనకు మా పాఠశాల ఎంపిక కాగా విద్యార్థుల భవిష్యత్ బంగారుబాటగా మారనుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు ఆలోచించాలి.

– సుధాకర్‌రావు, హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల గర్రెపల్లి

ఏటా రూ.40లక్షలు

ఎంపికైన ప్రతీ పాఠశాలకు ఐదేళ్లకు రూ.2కోట్లు కేటాయిస్తారు. ఏటా రూ.40లక్షలు సమాకురుతాయి. ఈ నిధులతో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన విద్య, సౌకార్యలు కల్పిస్తాం. – మాధవి, డీఈవో

క్లుప్తంగా

ఓసీపీ-1ను సందర్శించిన డీడీఎంఎస్



భారీ యంత్రాలను పరిశీలిస్తున్న డీడీఎంఎస్ సుధీర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టును డీడీఎంఎస్ మెకానికల్ సుధీర్ బైసారే బుధవారం సందర్శించారు. భారీ యంత్రాలను పరిశీలించి ఆపరేటర్ రక్షణకు ఏర్పాటు చేసిన యాంటి కొల్లిషన్ ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. డీడీఎంఎస్ వెంట ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఏరియా ఇంజినీర్ ఎలీషా, రక్షణాధికారి వెంకటరమణ, ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్ పాల్గొన్నారు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేస్తున్న డయాగ్నస్టిక్ హబ్‌లో, వైద్యవిధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు బుధవారం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు ఏప్రిల్ 21న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. 4 పోస్టులకు దరఖాస్తు చేసిన 27 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. వైద్యవిధాన పరిషత్‌లో 7 పోస్టులకు 17 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని వివరించారు. ఫలితాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. డీసీహెచ్ఎస్ శ్రీధర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ తిరుపతిరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృపాబాయి పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు మూడు కాలేజీ హాస్టళ్లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈ విద్యాసంవత్సరం నుంచి ఉన్నత విద్య చదివే ఎస్సీ విద్యార్థుల కోసం మూడు కాలేజీ హాస్టళ్లు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ సంగీత తెలిపారు. పెద్దపల్లిలో బాలికలు, బాలుర కోసం ఒక్కో వసతిగృహం ఉందని, సుల్తానాబాద్‌లో బాలుర కోసం మరో వసతి గృహం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పోస్టుమెట్రిక్ కళాశాల విద్య చదివే షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు వసతిగృహాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ప్రోత్సహించాలని సూచించారు.

ట్రాక్టర్ షోరూంపై దాడిలో ఒకరిపై కేసు

మంథని: మంథని పట్టణ శివారులోని జాన్ డీర్ ట్రాక్టర్ షోరూం అద్దాలు పగులగొట్టిన మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మల్లారం గ్రామానికి చెందిన సమ్మయ్య మంథని షోరూమ్‌లో ఇటీవల హార్వెస్టర్ కొనుగోలు చేశాడు. మరమ్మతులకు రావడంతో షోరూం నిర్వాహకులకు సమాచారం అందించారు. డీజిల్ పిల్లర్‌కు సమస్య తలెత్తిందని మరమ్మతులు చేశారు. ఇలా పలుమార్లు మరమ్మతులకు రావడంతో సమస్యతో విసుగుచెంది బుధవారం సదరు వినియోగదారుడు తన కుమారుడితో వచ్చి అద్దాలు పగులగొట్టాడు. షోరూమ్ సూపర్‌వైజర్ చంద్రమౌళి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

సకాలంలో విధులకు రాకుంటే చర్యలు

- ఆసుపత్రుల్లో బయోమెట్రిక్‌తో హాజరు
- పంచాయతీ భవనాలను త్వరగా నిర్మించండి
- స్థాయీసంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

పెద్దపల్లిరూరల్: ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించి అన్ని వసతులు కల్పించిందని, వైద్యులు సకాలంలో రాకుంటే చర్యలు తప్పవని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ హెచ్చరించారు. జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు బుధవారం జరిగాయి. మధు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో వైద్యులకు బయోమెట్రిక్‌తో హాజరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది కూడా సమయపాలన పాటించేలా చూసేందుకు ప్రజాప్రతినిధులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. గర్భిణులకు కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్ అమల్లోకి తెచ్చిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను సిద్ధంగా ఉంచాలని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 92 శాతం యూనిఫామ్, పుస్తకాలు జిల్లాకు చేరాయని డీఈవో మాధవి తెలిపారు. మిగతా వాటిని తెప్పించేలా చూడాలన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని పనుల్లో వేగం పెంచాలన్నారు. సీసీరోడ్డు పనులు పూర్తయ్యాయని, పంచాయతీ భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. భవనాలను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. జెడ్పీ సీఈవో శ్రీనివాస్, జెడ్పీటీసీలు రామ్మూర్తి, తిరుపతిరెడ్డి, స్వర్ణలత, శారద, నారాయణ, దివాకర్‌తోపాటు జిల్లా అధికారులు శ్రీధర్, మాధవి, ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

- కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలి
- డిమాండ్లు అంగీకరించకపోతే సమ్మెకు దిగుతాం
- జిల్లా సంఘం అధ్యక్షుడు బండారి వెంకటేశం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రేషన్‌డీలర్లు

పెద్దపల్లిరూరల్: స్వరాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత తమ బతుకులు బాగుపడతాయని భావిస్తే తొమ్మిదేళ్లుగా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రేషన్‌డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి వెంకటేశం, మద్దెల నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని రేషన్‌డీలర్ల సంఘ నాయకులతో కలసి బుధవారం కలెక్టర్ సంగీత, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, డీఎస్‌వో వెంకటేశ్‌లను కలిసి సమస్యలు విన్నవించారు. గోదాం వద్ద తూకంలో తక్కువ వస్తున్నాయని పేర్కొన్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలని కోరారు. తొలి ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈనెల 22న ప్రభుత్వం తమతో చర్చలు జరుపుతామని తెలిపిందని, జూన్ 5లోగా సమస్యలకు పరిష్కారం చూపకుంటే సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. నాయకులు ప్రభంజన్‌రెడ్డి, రాజన్న, ప్రభాకర్, చరణ్, కొమురయ్య, రాజేశం, స్వామి, రమేశ్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



రైల్వే కాంట్రాక్టు కార్మికులతో రమేశ్


గోదావరిఖని(రామగుండం): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు తోకల రమేశ్ కోరారు. ఆర్జీ-1 ఏరియా సీఎస్పీ రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమావేశం బుధవారం నిర్వహించారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతీ నెల 7వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని కోరారు. పేరుకే సర్క్యులర్లు జారీ చేస్తూ దానిపై సమీక్ష లేకుండా, కనీస పర్యవేక్షణ లేకుండా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సకాలంలో వేతనాలు అందక కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని డైరెక్టర్ ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కె.శంకర్, ఎం.సమ్మయ్య, చిన్నయ్య, మధు, కొయ్యడ సురేశ్, శనిగరపు కృష్ణ, గాజుల రమేశ్, గంగుల వెంకటేశ్, భూదారపు సురేశ్ పాల్గొన్నారు.

‘ఆ టీచర్ల డ్యూటీ సర్టిఫికెట్లు ఫేక్?’

జగిత్యాల: జిల్లాలో ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు పర్యవేక్షకులుగా సారంగాపూర్ మండలంలోని 10 మంది ఉపాధ్యాయులను మార్చి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు రిలీవ్ చేశారు. దీంతో వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటలకు సదరు పరీక్ష కేంద్రాల్లో రిపోర్ట్ సైతం చేశారు. కానీ వీరిలో కొందరు టీచర్లు అటు ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు, ఇటు పాఠశాలలకు వెళ్లలేదు.

అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు..

ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు వెళ్లిన టీచర్లు తిరిగి పాఠశాలల్లో జాయిన్ అయ్యే సమయంలో హెచ్ఎంలకు, హెచ్ఎంలే అయితే ఎంఈవోలకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంటుంది. కానీ అవి అందజేయకుండానే ఉపాధ్యాయులు తమ విధుల్లో చేరారు. 15 రోజులకు సంబంధించిన జీతం సైతం తీసుకున్నారు. ‘సాక్షి’ దినపత్రికలో ‘ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు’ అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో సంబంధిత ఎంఈవో ఈ నెల 15వ తేదీలోపు డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని వారిని ఆదేశించారు. దీంతో కొందరు అందజేశారు. వీరిలో పర్యవేక్షకులుగా పనిచేయనప్పటికీ ఫేక్ సర్టిఫికెట్ సృష్టించి, ఎంఈవోకు అందించినట్లు తెలిసింది. రిలీజ్ ఆర్డర్‌లో ఇంటర్మీడియట్ అధికారులు కంప్యూటర్ షీట్‌లో అబ్‌సెంట్, ప్రెజెంట్ వేశారు. కానీ కొందరు టీచర్లు వాటిని జిరాక్స్ తీసుకొని, చేతితో అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు. కాగా, మార్చి 15 నుంచి వీరు విధుల్లో చేరుతున్నట్లు ఉండగా డ్యూటీ సర్టిఫికెట్‌లో మాత్రం 10 నుంచే వెళ్లినట్లు పెట్టారు. అలాగే పేర్లను అధికారులు పెన్నుతో రాయగా కొందరు కంప్యూటర్ షీట్‌లో టైప్ చేసుకున్నారు. ఎవరి ఇష్టానుసారంగా వారు డ్యూటీ సర్టిఫికెట్లు తయారు చేసి, అందజేశారు. ఇవి ఫేక్ డ్యూటీ సర్టిఫికెట్లు అని స్పష్టంగా తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే నిజానిజాలు బయటపడతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సారంగాపూర్ ఎంఈవో భీమయ్యను వివరణ కోరగా డ్యూటీ సర్టిఫికెట్లు తీసుకొని, డీఈవోకు పంపించామని, ఆయన పరిశీలిస్తారని తెలిపారు.




SRI CHAITHANYA JUNIOR COLLEGE

RELIEVING ORDER

CHAITHANYA JUNIOR COLLEGE

ఒక సర్టిఫికెట్‌లో హ్యాండ్ రైటింగ్..



SRI CHAITANYA JUNIOR COLLEGE

మరో సర్టిఫికెట్ కంప్యూటర్ షీట్‌లో..

ప్రమాదవశాత్తు బావిలో పడిన గేదెలు



బావిలో పడిపోయిన గేదెలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయిలో బొంగోని నర్సయ్యగౌడ్‌కు చెందిన గేదెలు బావిలో పడగా స్థానికులు రక్షించారు. గేదెలను కాపరి అంజయ్య బుధవారం మేతకు తీసుకెళ్లాడు. అవి గడ్డి మేస్తూ వెళ్లి, ప్రమాదవశాత్తు పాడుబడ్డ బావిలో పడిపోయాయి. విషయం తెలుసుకున్న వార్డు సభ్యుడు అనిల్, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. బావి ఒడ్డును తవ్వి, గేదెలను బయటకు తీసుకువచ్చారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సాధిక్ వాటికి వైద్యం అందించారు. సంఘటన స్థలానికి ఎస్సై విజేందర్ చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు.

అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న బైక్

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): ఓ బైక్ అదుపు తప్పి, కల్వర్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన భార్గవ్, మౌనకృష్ణ, సుజిత్‌లు బుధవారం బైక్‌పై కరీంనగర్ నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్నారు. భూపతిపూర్ స్టేజి వద్ద వీరి వాహనం ఓ స్కూటీని తప్పించబోయి అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మౌనకృష్ణకు కాలు విరిగగా, మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు

జ్యోతినగర్(రామగుండం): భూమి విక్రయిస్తానని డబ్బులు తీసుకొని, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసగించిన వ్యక్తిపై ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. తన సమీప బంధువు పెద్దపల్లికి చెందిన అలుగువెల్లి సతీశ్ మూడు గుంటల స్థలం విక్రయిస్తానని తన వద్ద రూ.16.80 లక్షలు తీసుకున్నాడని ఎన్టీపీసీ ఠాణా పరిధిలోని మాతంగికాలనీకి చెందిన పోలంపల్లి స్వరూప ఆరోపించింది. తాను మోసపోయానని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సతీశ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు వారు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన బోగు లత(38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. లత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కావడం లేదు. బుధవారం కడుపునొప్పి తీవ్రమవడంతో ఆ బాధ భరించలేక దూలానికి ఉరేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- కూతురు పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక ఈ నెల 16న ఆత్మహత్యాయత్నం



శ్రీనివాస్ (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన కలబోని శ్రీనివాస్(50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కూలీ పని చేసేవాడు. ఇతనికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అప్పు చేసి, కూతురు పెళ్లి జరిపించాడు. అప్పు తీర్చలేక, వడ్డీ చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు కట్టపై క్రిమిసంహారక మందు తాగాడు. తర్వాత ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. వారు వెంటనే అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తొలుత కరీంనగర్, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

20న పౌరహక్కుల సంఘం బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ గ్రామాలపై కేంద్ర ప్రభుత్వ యుద్ధ హెలికాప్టర్ల దాడులను నిలిపివేయాలని, ఆదివాసీల జీవించే హక్కుకు భంగం కలిగించొద్దన్న డిమాండ్లతో ఈ నెల 20న పెద్దపల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పౌరహక్కుల, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని మూన్ ఫంక్షన్‌హాల్‌లో బహిరంగ సభ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్ అధ్యక్షతన జరిగే ఈ సభకు వక్తలుగా రాష్ట్ర పౌరహక్కుల సంఘం సీనియర్ కార్యవర్గ సభ్యుడు హరగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు.

తాళాలు వేసిన ఐదిళ్లలో చోరీ



విచారణ జరుపుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్, నారాయణస్వామినగర్‌లలోని ఐదిళ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. 10 తులాల బంగారం, 8 తులాల వెండి, రూ.1.20 లక్షలు ఎత్తుకెళ్లారని ఎస్సై మహేందర్ తెలిపారు. బాధితులు వేగోలపు తిరుపతి, కట్ట రమేశ్, రాజన్న, బొల్లంపల్లి మహేశ్, ఇనుగాల రాజ్‌కుమార్ తమ ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇళ్లలో జరిగిన కార్యక్రమాలకు వెళ్లారని పేర్కొన్నారు. క్లూస్ టీం, ఫింగర్‌ప్రింట్ నిపుణులు ఆధారాలు సేకరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జూలపల్లి(పెద్దపల్లి): నలభై ఏళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం విడిపోయిన వారంతా బుధవారం కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా విద్యాబుద్ధులు నేర్చుకున్న బడిలోనే మళ్లీ కలుసుకున్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 1982లో పదోతరగతి చదువుకున్న పూర్వ మిత్రులు ఒకే చోట చేరారు. అప్పటి హెచ్ఎం రోండ్ల రాంరెడ్డిని సన్మానించుకున్నారు. ఈ అపూర్వ కలయికకు ప్రధాన సంధానకర్త హైదరాబాద్‌లో వైద్యుడిగా స్థిరపడ్డ, కుమ్మరికుంటకు చెందిన చమన్‌సింగ్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు. రమేశ్, నరోత్తంరెడ్డి, పద్మజ, వినోద, శశిరేఖ, సరోజ, రమాదేవి, రాంరెడ్డి, మునిరెడ్డి, వెంకటేశం, దేవిసాని రాజేశం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1984–85 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం కాల్వశ్రీరాంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చిన్ననాటి మిత్రులను ఇన్నాళ్లకు కలుసుకున్నందుకు భావోద్వేగానికి గురయ్యారు. తమ గురువులను సన్మానించుకున్నారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పవర్‌హౌస్‌కాలనీ శివాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(40) బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా భిక్షాటన చేస్తూ, చెత్తను ఏరుకుంటూ బతికే ఇతను ఎండదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామని, సంబంధికులు ఎవరైన ఉంటే వన్‌టౌన్ ఎస్సై కమలాకర్‌ను 8712581052లో సంప్రదించాలని కోరారు.

ఎండకు తాళలేక..



పిల్లలకు పరీక్షహాల్‌లో ప్రశ్నలతో పోటీ పడుతుంటే తోడుగా వచ్చిన తల్లులు నిలువ నీడ లేక చెట్ల జాడ కోసం తిప్పలుపడ్డారు. అక్కడ స్టూడెంట్స్ ఇక్కడ పేరెంట్స్‌కు పరీక్షగా మారింది. బుధవారం జరిగిన పాలిసెట్ పరీక్షకు తమ పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చెట్లను ఆశ్రయిస్తూ కనిపించారు. పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద రాజీవ్ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లకింద పేరెంట్స్ ఇలా సేద తీరుతూ కనిపించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





ప్రశాంతంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్ పరీక్ష ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఏడు పరీక్ష కేంద్రాల్లో 2,928 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2,794 మంది (95.42శాతం) హాజరయ్యారని జిల్లా కో-ఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. ఇందులో బాలురు 1,604 మంది, బాలికలు 1,190 మంది హాజరయ్యారని వివరించారు.